భార్యాపిల్లలున్న ఓ భర్త మనసుపడిన ప్రేమకథ!

# కలలుకన్న రాధ

పెరుమాండ్ల శ్రీదేవి కథ

"ప్రేమ ఒక నిర్నిరోధ భావోన్మత్తత. ప్రేమ - చేతిలోకి వచ్చిన వాలని రంగుల పక్షి. మన ఎదుటే వుంటుంది. కాని మనదికాదు. అందినట్టే అందుతుంది. అందనంత దూరంగా వెళ్ళిపోతుంది''

ఎక్కడో చదివిన ఈ మాటలు నిజమేననిపిస్తున్నాయి. ఈ మధ్య నాకు. మనసంతా చిత్ర, విచిత్ర పరిస్థితిలో కొట్టుకుంటోంది. నా మానసిక పరిస్థితేమిటో నాకే అర్థంకావడంలేదు.


తెల్లవారి లేచిన దగ్గరనుండి రాత్రి పడుకునేవరకూ రాధ గురించిన ఆలోచనలే. ఏ అర్ధరాత్రికో నిద్రపట్టినా కలలోకూడా రాధే. అంతగా ప్రభావితం చేసింది ఆమె నన్ను.

రాధ! ఒక అందాల రాశి. అపరంజి బొమ్మ.

నుదురా? కాదది. ఆకాశంలో తేలియాడే మేఘమాలిక. కనుబొమ్మలా? కావవి. దిక్కులు కలుపుతూ వెల్లివిరిసిన ఇంద్రధనుస్సులు. కనులా? కావవి. కలువపూల రేకులు. నాసికా? కాదది. మల్లెతీగ తునక. చెంపలా? కావవి. సిగ్గుదొంతరలతో మెరుస్తున్న కెంపులు. పెదవులా? కావవి. విచ్చుకున్న మేఘపు తునకలు. చిరునవ్వా? కాదది. తటిల్లుమన్న క్రొన్నెల వంక మెరుపు.

నడకా! కాదది. కలహంస కులుకు.

మనస్సే వెరసి ఒక అద్భుతం. ఆ అద్భుతమే రాధ. కార్తీక మాసపు వెన్నెలంతా కుప్పగా పోస్తే రాధ. అందం, చదువు, తెలివి,



ఐశ్వర్యం లక్ష్మి అని నేనుం.

ఆమెను చూసిన క్షణమే నాలో ప్రేమ అంకురించింది. అప్పటినుండే నాలో మానసిక సంఘర్షణ మొదలయింది. ప్రేమించటమనేది తప్పు కాకపోవచ్చు. కాని, నాలాంటి వ్యక్తికి నైతికంగా మాత్రం అది తప్పు అవుతుంది. ఎందుకంటే నాకు ఇంతకుముందే వివాహమై ఇద్దరు

పిల్లలుకూడా వున్నారు కాబట్టి.

★ ★ ★

''హలో, గుడ్‌మార్నింగ్'' చెదరని చిరునవ్వుతో, రాధ పలకరింపు. నా హృదయంలో తటిల్లుమన్న కోటి వెన్నెలల మెరుపు.

పసుపుపచ్చ చుడీదార్‌లో మూర్తీభవించిన కొత్త అందంతో పలకరించిన రాధను చూడగానే ఒక్క క్షణం నా మనసు వశం తప్పింది. ఎప్పుడూ చిరునవ్వు చిందించే ఆ లేత పెదవులను ఒక్కసారి చుంబిస్తే...

ఉలిక్కిపడ్డాను ఆ ఆలోచనకి.

''ఛ... ఛ... వెధవ మనసు'' నన్ను నేను తిట్టుకున్నాను.

''ఏంటీ బదులు పలకకుండా ఏవో ఆలోచిస్తున్నారు.'' గాలికి ఎగురుతున్న నొక్కుల జుట్టును వెనక్కి తోసుకుంటూ అడిగింది.

''ఏంలేదు. ఈ రోజేంటి కొత్తగా కనిపిస్తున్నారు'' అడిగాను.

''ఈరోజు నా పుట్టినరోజు'' అంది.

''మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే'' ఆనందంగా అన్నాను.

''థాంక్యూ'' అని, స్వీట్ పాకెట్ నా చేతిలో పెట్టి వెళుతూ ''స్వీట్‌తోపాటు నా మనసుకూడా మీ చేతిలో పెట్టాను. జాగ్రత్త'' నవ్వుతూ వెళ్లిపోయింది రాధ.

నాకు ఆమె ఏమన్నదో సరిగా అర్థం కాలేదు. పాకెట్ తెరిచాను. పైన గులాబీరంగు కవర్. నా గుండె ఉద్వేగంతో కొట్టుకోసాగింది.

విప్పి చదివాను.

''డియర్ శశాంక!

నా ఈ పుట్టినరోజుకి కొత్తదనమే కాదు. ప్రత్యేకతకూడా వుంది. దానికి కారణం మీ పరిచయమే. మిమ్మల్ని మొదటిసారి చూసినప్పుడే మీరంటే ఎందుకో సాఫ్ట్‌కార్నర్ ఏర్పడింది. ఇన్నాళ్లు నేను వెతుకుతుంది మీ కోసమే అనిపించింది.

శశాంకగారూ, తల్లిదండ్రులు వుండికూడా చిన్నతనంనుండి ఒంటరితనమే అలవాటయింది. నాన్న బిజినెస్ వ్యవహారాలలో తలమునకలయితే, అమ్మ సమాజ సేవలో లీనమవుతుంది. డబ్బు, బిరుదుల్లు, సత్కారాలు, స్టేటస్ ఇవే వారికి ముఖ్యం. నా పెంపకమంతా ఆయా చేతులమీదుగానే జరిగింది. జీవితమంటే అదోలాంటి నిర్లిప్తత. హైక్లాస్ పీపుల్ మధ్య ఇమడలేక యాంత్రికమైన జీవనానికి అలవాటు పడిపోయాను.

మిమ్మల్ని చూడగానే నాకూ ఒక మనసుందని, అందులో ప్రేమ జనించిందని అర్థమయింది. ఆడపిల్లనైనా ధైర్యంగా అడుగుతున్నాను. నాకు మీ హృదయం కావాలి. ఇస్తారని ఆశిస్తూ...

రాధ''

ఉత్తరం చదవడం పూర్తికాగానే నా నుదుటిమీద స్వేదం అలుముకుంది. నిలువెత్తు మనిషిని సన్నగా కంపిస్తున్నాను.

అంటే, రాధ కూడా నన్ను ప్రేమిస్తోంది. ఏం చేయాలి నేనిప్పుడు. మెదడును తొలిచేస్తున్న ఆలోచనలు.

జీవితంలో మొదటిసారిగా ప్రేమలేఖ అందుకున్నాను. అదీ ఇద్దరు పిల్లల తండ్రినయ్యాక. మనసంతా అలజడి. ఆఫీస్ వర్క్ సరిగా చేయలేకపోయాను.

నాకు ట్రాన్స్‌ఫర్ అయి వస్తుంటే కళ్లనీళ్ల పర్యంతమైన అమాయకమైన నా భార్యను, ఆఫీస్‌నుండి ఇంటికి రాగానే ప్రేమగా చుట్టుకుపోయే పిల్లలను వదిలి ఒక్కణ్ణే నేనీ ఊరు వచ్చినప్పుడు నేను ఎంత బాధపడింది గుర్తొచ్చింది. మరోవైపు ఆశలన్నీ నామీదే పెట్టుకున్న ప్రేమించిన అమ్మాయి.

ఆలోచిస్తున్నాను. అర్థం అవుతుంది. అర్థం కావడంలేదు. ఆలోచనలతో తల వేడెక్కింది. రెండు చేతులలో తల పట్టుకూర్చున్నాను.

ఎన్నడూ లేనిది మనసెందుకిలా చంచలిస్తోంది. కాలేజీ జీవితంలోకూడా ఎప్పుడు ఏ అమ్మాయిని చూసినా చలించని ఈ మనసు... ఇద్దరు బిడ్డల తండ్రినయ్యాక ఇప్పుడురాధను చూశాక చలించడమేమిటి?


రాధ విషయంలో మనసును అదుపులో పెట్టుకోవడం కష్టమవుతోంది. ఏది ఏమైనా రాధకు నిజం చెప్పేయాలి. ఆ ఆలోచనతో మనసు కాస్త కుదుటపడింది.

★ ★ ★

ఆరుబయట వెన్నెల శ్వేత సముద్రంలా పొంగుతోంది. ఆకాశం ముంగిట్లో అదృశ్యదేవత ఎవరో అతి ఓపికగా చుక్కలు దిద్ది ముస్తాబు చేసినట్లు వెలిగిపోతున్న రంగవల్లులు.

మంచు రెక్కలల్లారుస్తూ, మౌనగీతికలాలపిస్తూ పరచుకున్న లేత చీకటి ఆ రోజు మా ఇద్దరిలో ఏమాత్రం ఆహ్లాదాన్ని కలిగించడంలేదు.

గదిలో ఓ మూల గోడకు ఒరిగి నిల్చుని వుంది రాధ. మనసులోని మంచు ముక్కల్లాంటి ఆశలు కరిగిపోయి, అవి కన్నీటి రూపంలో చెక్కిళ్ల మీదుగా



జారిపోతున్నాయి.

నాకు పెళ్లయిపోయిందన్న విషయం ఆమెను ఎంతగా హర్ట్ చేసిందో ఆమె మొహం చూడగానే అర్థమైంది నాకు. ఆమెను ఎలా ఓదార్చాలో అర్థంకాలేదు. నెమ్మదిగా ఆమె తలమీద చేయి వేశాను. ఆ మాత్రం ఓదార్పుకే ఆమె బర్స్ట్ అయిపోయింది.

నా గుండెలమీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడవసాగింది. అప్రయత్నంగా నా చేతులు ఆమె భుజాల్ని చుట్టుకున్నాయి. కాని, అందులో ఏ కోరికా లేదు. ఒక పసిపిల్లను లాలించే ఓదార్పు వుంది. అన్నింటికీ అతీతమైన భావన అది.

అలాగే క్షణాలు గడచిపోతున్నాయి. ఆలోచిస్తున్నాను.

కొన్ని కొన్ని కావాలంటే కొన్నింటిని వదులుకోవాలి. కొన్నింట్లో ఆనందం పొందాలంటే చాలా విషయాల్లో ఆనందాన్ని పోగొట్టుకోవాలి. మధుర స్మృతులు అనుభవించడం కాదు. కనీసం ఆస్వాదించాలన్నా కూడా చేదు అనుభవాల్ని చాలా ఎదుర్కోవాలట''

నిజమేననిపించింది నాకు. కాలం అలాగే నిశ్శబ్దంగా దొర్లిపోతోంది. ఆలోచనల అంతరంగపు సంఘర్షణ సద్దుమణిగి మనసు రాధవైపే మొగ్గుచూపుతోంది.

మాంగల్యంకంటే మనసుకే ప్రాముఖ్యత ఇస్తున్నానంటే రాధ నాలో కలిగించిన అలజడి ఏ(ప్రంత) అర్థం చేసుకోవచ్చు.

పెళ్లి అంటే ఇద్దరు వ్యక్తులు, ఒక సంసారమట. కాని, ప్రేమంటే ఆ ఇద్దరు వ్యక్తులే ఒక ప్రపంచం అయిపోవడమట.

నా మనసంతా రాధనే నిండిపోయింది. ప్రపంచమంతా ఎదురు తిరిగినా ఆమెను సొంతం చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చాను ఆ క్షణం.

కొంత సేపటికి రాధ తేరుకుని నా చేతులనుండి విడిపించుకుని మౌనంగా వెనుదిరిగింది.

''రాధా'' పిలిచాను.

తడిదేరిన కళ్లను బరువుగా ఎత్తి ఏమిటన్నట్టుగా చూసింది.

''ఇన్నాళ్లు ఈ విషయం చెప్పనందుకు కోపంగా వుందా'' అడిగాను.

''లేదు. పెళ్లయిన విషయాన్ని దాచి అమ్మాయిల్ని ట్రాప్ చేసే మగవాళ్లున్న ఈ రోజుల్లో, నేను ప్రేమించాననగానే విషయాన్ని దాచకుండా చెప్పిన మీరంటే ఇంకా ప్రేమ అధికమయింది'' అంది.

నేనేమీ మాట్లాడలేదు. కాసేపు ఇద్దరి మధ్యా మౌనం. ఆ మౌనాన్ని భరించడం దుర్భరంగా వుంది నాకు.

''ఐ లవ్ యూ రాధ'' అన్నాను నిశ్శబ్దాన్ని చీలుస్తూ.

జివ్వున కన్నీళ్లు చిప్పిల్లాయి రాధ కళ్లలో వెనుదిరిగి పరుగులాంటి నడకతో వెళ్లిపోయింది అక్కడినుండి.

నేను మాత్రం పాతేసిన శిలలా ఆ వెన్నెల రాత్రి చీకటి ఆలోచనల్ని తొలుస్తూ ఒంటరిగా మిగిలిపోయాను.

★ ★ ★

ఆరోజు తరువాత వారం రోజులకు వచ్చింది రాధ. మంద్ర సమీరం వీచినంత

హాయి అనిపించింది నాకు. మనసు పగలంతా తొడుక్కున్న వేదనల్ని విడిచేసి, వెన్నెల కిరణాలను హాయిగా చుట్టుకుంది. సుళ్లు తిరిగే మధురోహలు హృదయం లోలోన కోటి గొంతులతో ప్రతిధ్వనిస్తున్నాయి.

రాధ వస్తూనే నా చేతిలో ఓ కవర్ పెట్టింది. విప్పి చూశాను అది మళ్లీ నన్ను తిరిగి మా ఊరికి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నట్లున్న ఆర్డర్స్ కాగితాలు.

''రాధ ఏమిటిది?'' ఆశ్చర్యంగా అన్నాను.

''మీ మంచికోసమో, నా మంచికోసమో ఇలా చేయక తప్పలేదు. మీరు ఎదురుగా వుంటే నన్ను నేను అదుపులో పెట్టుకోవడం కష్టమవుతోంది. నా స్వార్థంకోసం, మరొక సంసారాన్ని పాడుచేసే కుసంస్కారం నాకు లేదు'' దుఃఖంతో ఆమె గొంతు వణుకుతోంది.


''కానీ... నీ ప్రేమ...'' ఆ తరువాత ఏమనాలో అర్థం కాలేదు నాకు.

''సముద్రంలో పుట్టే ప్రతి అల తీరం చేరదు. కొన్ని అలలు మధ్యలోనే తిరిగిపోతుంటాయి. నా ప్రేమకూడా అంతే. అదో అనుభవంగా మిగిలిపోనీ. అనుభవాలు జీవితంలో అందంగా ఒదిగి పోవాలిగానీ, అస్థిత్వాన్ని హరించకూడదు'' అంది.

''మరి నా ప్రేమ... నీకు దూరమై జీవితకాలం ఈ దుఃఖాన్ని మోయగలనా'' అన్నాను.

''దుఃఖం ఉన్నచోట ప్రేమ వుంటుంది. ప్రేమ ఉన్నచోట ఖచ్చితంగా దుఃఖం వుంటుంది. శరీరాలు కలిస్తే ఆ ప్రేమకు పరిపూర్ణత వస్తుందేమోగానీ, మనసులు మాత్రం కలిస్తే మాత్రం ఆ ప్రేమ శాశ్వతమవుతుందని నా నమ్మకం. స్నేహంకన్నా, ప్రేమకన్నా, చివరకు దైవంకన్నా గొప్పది త్యాగం'' వేదాంత ధోరణిలో అంది రాధ.

## డాక్టర్ సలహా



''కాళ్లు చేతులు పీకుతున్నాయ్ డాక్టర్ బాబూ'' చెప్పాడు రంగడు.

''నీవు ఏమి చేస్తావు ఏంటి''

''రిక్షా తొక్కుతుంటాను బాబూ''

''ఆమాత్రం తెలుసుకోలేకపోయావా? రిక్షా తొక్కితే అలాగే పీకుతాయ్. ఓ మారుతీ కారు కొనుక్కో'' సింపుల్‌గా చెప్పాడు డాక్టర్.

- పుల్లూరు యోగిలక్ష్మి (తుమ్మలపల్లి)

నేనేమీ మాట్లాడలేదు. మళ్లీ తనే అంది. వీలైనంత తొందరగా మీరిక్కడినుండి వెళ్లిపోండి. నిన్ను నమ్ముకుని, నీకోసం పరితపించే నీ మనుషుల దగ్గరకు వెళ్లండి''

''రాధా... మరి నువ్వు'' అర్ధోక్తిగా ఆగిపోయాను.

ఆ మాటకు నవ్వింది ఆమె.

''ఒక సాయంకాలంనుంచి మరొక సాయంకాలానికి చేరాలంటే చీకటి వాకిలి తలుపులు తెరిచి ఒక రాత్రినీ, ఒక ఉదయాన్నీ దాటాలట. ఒక కోయిల పాట వినడానికి ఐదు ఋతువులు వేచి చూడాలట. మరో జన్మంటూ వుంటే ఈ జన్మదాటి మీకోసం... కేవలం మీకోసమే మరో జన్మ ఎత్తుతాను. అంతవరకూ సెలవు'' ఆమె వెనుదిరిగింది.

ఒక సుడిగాలిలా నా హృదయంలోకి దూసుకొచ్చిన రాధ. చల్లని పిల్లగాలి తెమ్మెరలా, నెమ్మదిగా నా జీవితంనుండి నిష్క్రమిస్తోంది.

ఆమె వెళ్లిపోతోంది. నానుండి... నా జీవితంనుండి దూరంగా... సుదూరంగా... మళ్లీ అదే యాంత్రికమైన జనారణ్యంలోకి వెళ్లిపోతోంది. నా మనసునెవరో రెండుగా చీలుస్తున్న భావన.

కన్నీళ్లు నిండిన నా కళ్లకు ఆమె రూపం అస్పష్టంగా కనిపిస్తోంది. భౌతికంగా ఆమె ఎంత దూరంగా వెళుతుందో, నా హృదయానికి అంతగా చేరువవుతుంది. అద్భుతమైన ఆమె వ్యక్తిత్వంతో ఆమె మీద ఉన్న నా ప్రేమ రెండింతలయింది.

మలుపు తిరగడంతో ఆమె కనుమరుగయింది. అయినా, ఆమె ఊపిరి నిండిన గాలి వింత పరిమళాల్ని మోసుకొస్తూ నాకు తెలియని అనుభూతిని కలిగిస్తోంది. రాధ! ఒక అందమైన అల... కరిగిపోయిన కల...

నా చేతిలో గాలికి రెపరెపలాడుతున్న ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ కాగితాలు. నా భవిష్యత్తుకు దారి చూపుతున్నట్టుగా...

వాటిని మడిచి జేబులో పెట్టుకున్నాను.

''జీవితాన్ని కాలమే శాసిస్తుంది.

హృదయాన్ని ప్రేమనే బంధిస్తుంది.

సముద్రమంత త్యాగానికి లిపిలేని కన్నీటి చుక్కే సాక్షిభూతం అవుతుంది''

ఎక్కడో చదివిన ఈ మాటలుకూడా నిజమేననిపిస్తున్నాయి నాకు.

